శ్రద్ధ పెట్టారు.. సాధించారు


ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు (ఫైల్)

పది ఫలితాల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

- 95శాతం మంది ఉత్తీర్ణత
- స్టడీ అవర్స్, ప్రత్యేక తరగతులు ఉపయోగపడ్డాయన్న విద్యార్థులు

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యార్థులు ఈ ఏడాది పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటారు. 39మంది విద్యార్థులకుగాను 37మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 95 శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్‌బాబు, ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషిచేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రతీనెలా సమావేశాలు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రగతిని గమనిస్తూ ప్రోత్సహించారు. వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. దీంతో ఉపాధ్యాయుల పర్యవేక్షణలో శ్రద్ధగా చదివిన విద్యార్థులు మంచి ఉత్తీర్ణతతో పాటు జీపీఏలు సాధించారు. డి.గణేష్(9.7), కె.ఆంజనేయులు(9.2), కె.అరుణ్‌కుమార్(9.2), ఎం.సాయిప్రజీత్(9)తోపాటు 8.8గ్రేడ్‌తో 5గురు, 8.5 గ్రేడ్‌తో ఇద్దరు, 8.3 గ్రేడ్‌తో ఒక్కరు, 8.2గ్రేడ్‌తో నలుగురు, 8.0 గ్రేడ్‌తో ఏడుగురు విద్యార్థులు సత్తాచాటారు.

సమష్టి కృషితోనే..



ఉపాధ్యాయుల సమష్టి కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థుల పట్టుదలతో ఉత్తమ ఫలితాలు సాధించాయి. ప్రత్యేక తరగతులు, చదువులో వెనకబడిన విద్యార్థులకు సబ్జెక్టుపై అవగాహన కల్పించాం. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు.

– శంకర్‌బాబు, ప్రిన్స్‌పాల్, బీసీ గురుకుల, కొడంగల్

స్టడీ అవర్స్ ఉపయోగపడ్డాయి



పరీక్షలకు ముందు నిర్వహించిన స్టడీ అవర్స్ ఎంతగానో ఉపయోగపడ్డాయి. ప్రభుత్వం స్నాక్స్ ఇచ్చి ప్రోత్సహించింది. సబ్జెక్టుల్లో ఉన్న సందేహాలను స్టడీ హవర్స్‌లో క్లియర్ చేసుకున్నాం. ఉపాధ్యాయులు మాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదివించారు. 9.7 జీపీఏ సాధించడం పట్ల ఆనందంగా ఉంది.

– గణేష్, బీసీ గురుకుల, కొడంగల్

ప్రణాళికతో చదివాం



పరీక్షలను దృష్టిలో పెట్టుకొని ఉపాధ్యాయులు పక్కా ప్రణాళికతో చదివించారు. ప్రాక్టీస్ చేసుకోవడానికి స్టడీ హవర్స్ ఉపయోగపడ్డాయి. అన్ని సబ్జెక్టులకు ఇచ్చిన స్పెషల్ స్టడీ మెటీరియల్ ఉపయోగడపడింది. భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనుంది.

– ఆంజనేయులు, బీసీ గురుకుల, కొడంగల్

ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు



పరీక్షలప్పుడు ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. తల్లిదండ్రులతో నెలకోసారి మీటింగ్ ఏర్పాటు చేసి ఇంటి వద్ద ఎలా చదివించాలో వివరించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషిచేసిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలో నిలవాలని ఉంది.

– అరవింద్‌కుమార్, బీసీ గురుకుల, కొడంగల్

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు


ప్రసాద్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు


ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న పూజారి

మర్పల్లి: మండల పరిధిలోని సిరిపూరం గ్రామంలో కొనసాగుతున్న ఆంజనేయస్వామి మందిర ప్రారంభోత్సవం, విగ్రహప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం వేద పండితుల సమక్షంలో హోమం నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయంలో ఆంజనేయ స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేపట్టారు. పూర్ణాహుతి, మంగళహారతి చేపట్టారు. వేదపండితులు ప్రత్యేకంగా పూజలు చేశారు. ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ మంత్రి..

మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట నాయకులు..రాములు, సంజీవరెడ్డి, మహేష్, గోపాల్, మర్రి లక్ష్మారెడ్డి, రాజిరెడ్డి, సర్పంచ్ మల్లయ్య ఉన్నారు. అంతకు ముందు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి జి.సుభాష్ యాదవ్, మర్పల్లి మాజీ సర్పంచ్ పాండునాయక్, మాజీ ఎంపీటీసీ శేఖర్‌యాదవ్, మర్రి కృష్ణారెడ్డిలతో కలిసి పూజలు చేశారు.అతిథులను ఉత్సవాల కమిటీ చైర్మన్ శంకరయ్యగౌడ్, సర్పంచ్ మల్లయ్య, ఎంపీపీ బట్టు లలిత, నారాయణ్‌రెడ్డి ఘనంగా సన్మానించారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి


బొంరాస్‌పేట: సమ్మెకు మద్దతు తెలుపుతున్న బీసీ సంఘం నేతలు

బొంరాస్‌పేట: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని కొడంగల్ తాలూకా బీసీ సంఘం అధ్యక్షుడు బస్వరాజ్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ధర్నాకు ఆయన మద్దతు తెలిపారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా చెప్పిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఈ సమ్మెలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ముత్తిశ్రీను, ఆశప్ప, కార్తిక్, నరేందర్, బసంత్‌రెడ్డి తదితరులున్నారు.

సమ్మెకు కాంగ్రెస్ నేతల మద్దతు..

కొడంగల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను శుక్రవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రసిడెంట్ ఆనంద్‌రెడ్డి, సర్పంచ్ బాల్‌రెడ్డి, మాజీ సర్పంచు సంజీవ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నయీం తదితరులు కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారికి ఆర్థికసాయం అందించారు.

జేపీఎస్‌ల కొవ్వొత్తుల ప్రదర్శన..

అనంతగిరి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జేపీఎస్‌లు సమ్మె చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం వరంగల్ జిల్లాలో సోని అనే జేపీఎస్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఆమె మృతికి సంతాపంగా శుక్రవారం రాత్రి వికారాబాద్ పట్టణంలో జేపీఎస్, ఓపీఎస్‌లు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి సోని ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పట్టువీడాలన్నారు. డిమాండ్లు పరిష్కరించాలన్నారు.


అనంతగిరి: సోనీ చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న జేపీఎస్‌లు

సీపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని చటాన్ పల్లిలో శుక్రవారం సీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను బీఆర్ఎస్ నేత అశోక్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని చెప్పారు. క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి టోర్నీలు ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. యువతకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని తెలిపారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని అన్నారు. ఓటమి చెందిన వారు నిరుత్సాహపడకుండా రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగాలని సూచించారు. టోర్నీ లో గెలుపొందిన జట్టుకు రూ.9999, రన్నర్ జట్టుకు రూ. 5555 నగదు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎవరు గెలిచినా పాజిటివ్‌గా తీసుకోవాలన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్, శ్రీనివాస్‌రెడ్డి, నాని, సాయి, రమేష్, శివ, శ్రీను, రాజేష్, కన్నా తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పిస్తాం

జెడ్పీటీసీ నాగిరెడ్డి


వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

దోమ: రైతుల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని దోమ జెడ్పీటీసీ నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం దోమ మండలం కిష్టాపూర్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం అమ్మేందుకు రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతీ గింజను కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా కిష్టపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ సత్యమ్మ, ఉప సర్పంచ్ అనసూయమ్మ, సొసైటీ వైస్ చైర్మన్ శేఖరయ్య, నాయకులు రాఘువేందర్‌రెడ్డి,కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, సంతోష్, వెంకటేష్‌గౌడ్, నర్సింహులు, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సాయన్న విగ్రహ ఆవిష్కరణకు రండి

జెడ్పీవైస్ చైర్మన్ గణేశ్


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గణేశ్ తదితరులు

నందిగామ: షాద్‌నగర్‌లో ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన పండగ సాయన్న విగ్రహ ఆవిష్కరణ ఆదివారం నిర్వహించనున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్ పేర్కొన్నారు. మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మెకంరాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గణేశ్ హాజరై విగ్రహ ఆవిష్కరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గణేశ్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు ఐకమత్యంతో ఉండాలని, విద్య ఉద్యోగ, రాజకీయాలతో పాటు వ్యాపారాల్లో రాణించాలని సూచించారు. పండగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరణకు ముదిరాజులందరూ భారీ ఎత్తున తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చేగూరు మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్, నాయకులు నర్సింహా, అశోక్, చందన్, సాయిలు, యాదయ్య, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలోకి భట్టి పాదయాత్ర


భట్టి విక్రమార్కతో కలిసి నడుస్తున్న నాయకులు

చేవెళ్ల: పీపుల్స్ మార్చ్ పేరుతో కాంగ్రెస్ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర శుక్రవారం చేవెళ్లలోకి ప్రవేశించింది. జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో తరలివెళ్లిన పార్టీ శ్రేణులతో కలిసి ఆయన వెంట పాదయాత్రలో నడిచారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో కాంగ్రెస్‌పార్టీ టీపీసీసీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, బి. శ్రీనివాస్‌గౌడ్, నియోజకవర్గం నాయకులు ఎస్. వసంతం, దర్శన్, భీంభరత్, జిల్లాపార్టీ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, రాములు, పెంటయ్యగౌడ్, వీరేందర్‌రెడ్డి, మానేయ్య, సురేందర్, సూర్యపేట శ్రీనివాస్, పాండుయాదవ్, రాంరెడ్డి, శేఖర్, వాజిద్, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయ పునఃనిర్మాణానికి విరాళం


ఆలయ కమిటీ సభ్యులతో కొండల్‌రెడ్డి

మర్పల్లి: మండల పరిధిలోని ఘణాపూర్ గ్రామంలోని ఆంజనేయ స్వామి మందిర పునఃనిర్మాణ పనులు చేపట్టేందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి శుక్రవారం రూ.లక్ష 20వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని పురాతన ఆలయ పునఃనిర్మాణ పనులను చేపట్టడం సంతోశించదగ్గ విషయమన్నారు. మందిర నిర్మాణం కోసం దాతల నుంచి విరాళాలు సేకరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఆలయ కమిటీ సభ్యులకు ఆయన విరాళం అందజేశారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ శంకర్, గ్రామస్తులు ఉన్నారు.

ఎమ్మెల్యే నివాళి

ధారూరు: మండల పరిధిలోని కెరెళ్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన మాజీ సర్పంచ్ బేగరి లక్ష్మి మృతదేహానికి శుక్రవారం వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్ నివాళి అర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

ఉత్సవాలకు విరాళం

దోమ: మన సంస్కృతి, సాంప్రదాయాలను మనమే కాపాడుకోవాలని బీజేపీ నేత, కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దోమ మండలం మోత్కూరు గ్రామంలో గాలి పోచమ్మ, బంగారు మైసమ్మ ఉత్సవాల నిర్వహణకు రూ.20వేల విరాళాన్ని అందించారు. స్థానిక యాదవ సంఘ నాయకులు బాలరాజు, గొల్ల శివయ్య, వెంకటయ్య, నర్సింలు, మల్లయ్య, హన్మయ్య, రాజు, కిష్టయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకు ప్రతిరూపం నర్సులు

- లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి
- నర్సుల సహకారంతోనే ఆస్పత్రుల నిర్వహణ: డాక్టర్ రాధిక


కందుకూరు పీహెచ్‌సీలో నర్సులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కందుకూరు: రోగులకు సేవలు అందించడంలో నర్సుల పాత్ర ప్రాముఖ్యమైనదని లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కందుకూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పీహెచ్‌సీలోని నర్సులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. నిస్వార్థ సేవకు ప్రతి రూపం నర్సులన్నారు. ప్రాథమిక వైద్యంలో, దీర్ఘకాలిక వ్యాధులతో సపర్యలు చేస్తూ మానవాళి ఆరోగ్యానికి భరోసా కల్పించడంలో నర్సుల పాత్ర అమోఘమైనదని కొనియాడారు. నర్సుల సహకారం లేకపోతే ఆస్పత్రుల నిర్వహణ కష్టతరమన్నారు. లయన్స్‌క్లబ్ వారు నర్సుల సేవలను గుర్తించి సన్మానించడం అభినందనీయమన్నారు. లయన్స్‌క్లబ్ సభ్యుడు వెంకటేశ్వర్లుగుప్తా, హ్యూమన్‌రైట్స్ అసోసియేషన్ నిర్వాహకుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరిస్తాం

మహేశ్వరం: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని నబీల్ కాలనీలో నెలకొన్న మురుగు సమస్యను పరిష్కరిస్తామని 3వ వార్డు కౌన్సిలర్ అహ్మద్ కసాది అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన డీఈ వెంకన్నతో కలిసి కాలనీలో పర్యటించారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ.. వర్షపు నీరు, మురుగు వెళ్లేందుకు సరైన మార్గం లేక కాలనీ వాసులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ విషయాన్ని కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించడంతో రూ.62లక్షల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ పనులు పూర్తైతే మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. అభివృద్ధి పనులకు అడిగినవెంటనే నిధులు కేటాయిస్తున్న మంత్రి సబితారెడ్డి, చైర్మన్ అబ్దుల్లా సాదిలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

యంత్రాల కొరత... వరి రైతుల వ్యథ

- అకాల వర్షాలతో నష్టపోతున్న వైనం
- వరికోత యంత్రాల అద్దె పెరగడంతో దిక్కుతోచని స్థితిలో రైతన్న
- కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలంటూ వినతులు


పెద్దేముల్‌లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

పెద్దేముల్: వరి రైతులకు ఏటా కష్టాలు తప్పటం లేదు. ఓ వైపు అకాల వర్షాలు, మరోవైపు కోత యంత్రాలు దొరకక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒకవేళ కోతలు జరిగినా సరైన సమయంలో ధాన్యం తుకాలు కాకపోవడంతో రైతులు లబోదిబో మంటున్నారు. గతంలో మండలంలో సుమారు ఆరు కొనుగోలు కేంద్రాలు ఉండేవి. ప్రస్తుతం నాలుగు ప్రారంభిస్తామని చెప్పినప్పటికీ.. ఇప్పటికి నామమాత్రంగా ఒక కేంద్రం మాత్రమే ప్రారంభించారు. మిగితా గ్రామాల్లో కేంద్రాలు ప్రారంభం కాక కోతలు కోసిన రైతులు ధాన్యం రోడ్లపై వేసుకొని నానా ఇబ్బందులు పడుతున్నారు. టార్పాలిన్ కూడా దొరకడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని మన్సాన్‌పల్లి, మంబాపూర్, జనగాం, పెద్దేముల్, గాజీపూర్, బుద్దారం, కందనెల్లి, రుక్మాపూర్, దుగ్గాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో రైతులు సుమారు 3,500 ఎకారాల్లో వరి పంటను సాగుచేశారు. పదిరోజుల నుంచి అకాలవర్షాలు కురవడంతో వరిపంట చేతికి వచ్చినా రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా సమయానికి కోత యంత్రాలు దొరకక ఏటా ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. వరిపంటకు అనువైన నేలలు ఉండటంతో ఇక్కడి రైతులు ఎక్కువగా వరి పంటను సాగుచేస్తున్నారు. ప్రస్తుతం వరిపంటకు బదులు ఇతర పంటలు సాగుచేయాలని ప్రభుత్వం చెప్పినా రైతులు మాత్రం వరిపంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. గతంలో కోటపల్లి ప్రాజెక్టు కింద వరితో పాటు వేరుశనగా పంటలు సాగుచేసేది.ప్రస్తుతం వరిపంటకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. అంతేగాకుండా అప్పట్లో ప్రభుత్వం వేరుశనగతో పాటు ఇతర విత్తనాలు ప్రభుత్వం సబ్సిడీపై అందజేసేది. ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

యంత్రాలకు డిమాండ్..

వరికోత యంత్రాలు (హర్వెస్టర్లు) సమయానికి దొరకటం లేదని రైతులు వాపోతున్నారు. గతంలో గంటకు రూ.2000ఉండగా డీజిల్ ధరలు పెరగటంతో రూ.2500కు గంట చేశారు. మరికొంత మంది రూ.3000 కూడ అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. దానికి తోడు కూలీల కొరత తీవ్రంగా ఉంది. రోజుకు రూ.500 చెల్లించినా దొరకటం లేదు. దీంతో పంట నేలపాలయ్యే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించడంతో పాటు, తక్కువ ధరకు యంత్రాలు లభ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

15 నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

పూడూరు: మండల కేంద్రంలో ఈనెల 15 నుంచి ముఖ్యమంత్రి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ ఉమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15, 16, 17 తేదీల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. మండల స్థాయిలో ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్‌లో.. హైజంప్, లాంగ్‌జంప్ తదితర పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల 18 నుంచి 36 వయస్సులోపు యువతీ యువకులు ఆదివారం(మే 14) 5 గంటల వరకు ఎంపీడీఓ కార్యాలయంలో పేర్లు నమోదుచేసుకోవాలని తెలిపారు.

బంట్వారం మండలంలో..

బంట్వారం: ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బాలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీఫ్ మినిస్టర్ కప్–2023 పేరుతో అథ్లెటిక్స్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, ఫుట్‌బాల్ పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు మండల పరిషత్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

పేద కుటుంబానికి చేయూత

పూడూరు: మండల పరిధిలోని తిర్మలాపూర్ పంచాయతీ పరిధిలోని పేదింటి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసినట్లు డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య తెలిపారు. గ్రామానికి చెందిన టోప్యానాయక్ కూతురు వివాహానికి ఆయన హాజరయ్యారు. గ్రామంలో ఎలాంటి శుభకార్యం జరిగినా తనవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రూ.11వేల నగదును పెళ్లికూతురు కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాములునాయక్, గోపాల్‌నాయక్, పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

36వ రోజుకు చేరిన దీక్ష

పెద్దేముల్: పెద్దేముల్ మండలంలోని తట్టెపల్లిని నూతన మండలం చేయాలంటూ మండల సాధన కమిటీ చేపట్టిన నిరసన దీక్ష శుక్రవారానికి 36వ రోజుకు చేరుకుంది. తట్టెపల్లి, బండమీదిపల్లి, జైరాంతండా, ఓంలానాయక్ తండా, సిద్దన్నమడుగుతండాతో పాటు పలు గ్రామాల ప్రజలు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. తట్టెపల్లిని వెంటనే మండల కేంద్రంగా ప్రకటించాలని కోరారు. మండలం చేయండి అని అడిగితే కేసులు పెట్టడం ఎంతవరకు న్యాయమన్నారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు.

సర్వే పనులను వేగవంతం చేయండి

ఎంపీడీఓ రాజ్ మల్లయ్య

మర్పల్లి: గ్రామంలో చేపడుతున్న ఇంటింటి సర్వే పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ రాజ్ మల్లయ్య... పంచాయతీ కార్యదర్శి చందును ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్లాపూర్ గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు ప్రతి ఇంట్లో ఉన్నాయా? లేవా అనే వివరాలను తెలుసుకొనేందుకు సర్వే పనులు చేపట్టారు. మరుగుదొడ్ల నిర్మాణం చేపడితే సెప్టిక్ ట్యాంకులు రెండు ఉన్నాయా? లేవా? ఇంటి అవసరాల కోసం వాడిన నీరు రోడ్లపైకి రాకుండా ఇంకుడుగుంత ఉందా అనే వివరాలు స్పష్టంగా గుర్తించాలన్నారు. మరుగుదొడ్లు లేనివారి వివరాలు ఇస్తే వెంటనే మరుగుదొడ్ల నిర్మాణానికి అనుమతులు, నిధులు మంజూర్ చేస్తామని ఎంపీడీఓ తెలిపారు. ఆయన వెంట సీనియర్ సహాయకులు కృష్ణారావ్, ఎంపీఓ మహేశ్, ఏపీఓ అంజిరెడ్డి ఉన్నారు.

కోట్‌మర్పల్లిలో కంటివెలుగు శిబిరం

మర్పల్లి: కంటి వెలుగు శిబిరాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ విజయలక్ష్మి రాచన్న అన్నారు. మండల పరిధిలోని కోట్‌మర్పల్లి గ్రామపంచాయతీలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిరిపూరం సహకార సంఘం మాజీ చైర్మన్ రఘుపతిరెడ్డి, వార్డు మెంబర్ జైహింద్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాచన్న, ఏఎన్ఎం నిర్మల వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.

మైతాప్‌ఖాన్‌గూడలో..

నవాబుపేట: మండల పరిధిలోని మైతాప్‌ఖాన్ గూడలో ఆ గ్రామ సర్పంచ్ శుక్రువారం అనిత కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కంటి సమస్యలు ఉన్నవారికి పరీక్షలు చేసి అవసరం ఉన్నవారికి కంటి అద్దాలు, శస్త్ర చికిత్సలు ప్రభుత్వమే చేయిస్తుందన్నారు. డాక్టర్ రోహిత్, జగదీశ్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు ఉన్నారు.

బొడ్రాయికి బోనాల సమర్పణ


బోనాల ఊరేగింపులో మహిళలు

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లి గ్రామంలో గత మూడురోజులుగా కొనసాగుతున్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మరియు బొడ్రాయి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బొడ్రాయికి గ్రామస్తులు బోనాలు సమర్పించారు. మహిళలు ఇళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బోనాలతో ఊరేగింపుగా గ్రామ వీధులగుండా ఆంజనేయ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి బొడ్రాయికి సమర్పించారు. పాడి పంటలు సమృద్ధిగా పండి గ్రామంలో అందరూ సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని మొక్కుకున్నారు.